కథ



# ఇన్‌స్టంట్ లైఫ్

## కుప్పిలి పద్మ

*రోజ్‌వుడ్ పెయింట్ చేసిన 2'' × 2'' నలుచదరపు టేబుల్‌కి అటో కుర్చీ, ఇటో కుర్చీ. టమోటా చిల్లిసాస్. వెనిగర్. సాల్ట్. పెప్పర్. చిన్నిచిన్ని పింగాణీ గిన్నెలతో అమర్చిన ట్రే. యుఎస్ పీజా వాసనలు. ప్లాస్టిక్ గ్లాసుల్లోని కోక్ స్ప్రెయిట్ థమ్సప్ చల్లదనాలు.*

*ఫ్లై వోవర్ మీది నుంచి ఎడతెరిపి లేకుండా సాగిపోతోన్న కార్లు. స్కూటర్లు ఆటోల మధ్య బస్సులు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఎదురుచూస్తున్న వాహనం మాత్రం కనిపించటంలేదు.*

ఎర్రదీపాలు వెలిగి ఆరుతున్నాయి. రయ్ఁ రయ్ఁమంటూ పైలెట్ వాహనం వెనక వరుసగా వో పదికార్లు. టైట్ సెక్యూరిటీతో. వో మూడు నిమిషాల తర్వాత అటూయిటూ ఆపిన వాహనాలని వదిలారు. మూడు గుక్కల కోక్ తాగేలోగా నలుగురైదుగురు వి.ఐ.పి.లు ఈ రోడ్డులో అటు ఎయిర్ పోర్ట్‌కో, ఇటు రాజ్‌భవన్‌కో, జూబ్లీహిల్స్‌కో, కాలేజ్ రోడ్డులోని వి.వి.ఐ.పి.ల ఇళ్లకో పోతుంటారు.

రోడ్డు విశాలత్వాన్ని మింగేస్తోన్న వాహన రద్దీ. ఇద్దరు విదేశీయులు చేయిచేయి పట్టుకొని రోడ్డు డివైడర్‌పై పెంచిన లాన్‌ని తొక్కుకుంటూ రోడ్డుని క్రాస్ చేస్తున్నారు. స్వదేశీయులకి ఇంకా అంత తెగింపురాలేదు. కిలోమీటర్ దూరం నడిచే రోడ్డుని క్రాస్ చేస్తున్నారు. రోడ్లు వెడల్పు చేసినా, ఫ్లైవోవర్లను నిర్మించినా నడిచేవారికి చోటెందుకు వుండదో?!

ట్రాఫిక్‌లోంచి ఆగిఆగి వస్తున్న సందీప్.

గత రెండ్రోజులుగా నిద్రపట్టడంలేదు. ఆత్రుత. ఆందోళన. దిగులు. బరువుగా భారంగా రెండ్రోజుల నిరీక్షణ.

ఎస్.డి.ని పార్క్ చేసి జుట్టు సరిచేసుకొని లోపలికి వచ్చాడు. వెలుతుర్లోంచి లోపలికి రాగానే అమర్చిన మసకతనం. చల్లదనం. అలవాటైన మూలకి వచ్చి కుర్చీలో కూర్చుంటూ 'హాయ్ఁ సారీ. ట్రాఫిక్'- ఇద్దరిలో ముందువచ్చిన వాళ్లకి ఇచ్చే కామన్ సంజ్ఞాయిషి.

తర్వాత మాటలు పెగలటం లేదు.

రెండ్రోజుల ముందువరకైతే-

మా యిద్దరి కబుర్లకి కామా ఫుల్‌స్టాప్‌లేలేవు. మధ్యమధ్య అమ్మ గుర్తొచ్చినప్పుడల్లా యీ మాటల్లో కొన్నైనా గుర్తుంచుకోవాలనే ప్రయత్నం. కలిసిన ప్రతిసారీ యిదే ఆలోచన. వొక్క మాటా గుర్తుండదు. వో రెండు మూడు గంటలు మా యిద్దరం ఎదురెదురుగా కూర్చుని గడిపాం. ఐ.టి. సాఫ్ట్‌వేర్. హార్డ్‌వేర్. మేనేజ్‌మెంట్ కోర్సులు. హాలీవుడ్ బాలీవుడ్. సోషియాలజీ. పాలిటిక్స్. వొక్కటేంటి కలగాపులగం.

'అన్నేసి గంటలు మీరంతా ఏం మాట్లాడుకుంటారు'- వోరోజు అమ్మ అడిగింది.

తెల్లమొహం వేసా.

అప్పట్నుంచి వొక్క రోజైనా మేం మాట్లాడేవి గుర్తు పెట్టుకొని అమ్మకి చెప్పాలనే ప్రయత్నం. ఏం గుర్తుండవ్.

అలా అని చెప్పగానే అమ్మ నవ్వుతుంది.

పక్క టేబుల్ దగ్గర సర్వ్ చేస్తున్న వ్యక్తిపైనే చూపులు నిలిచాయి. బాగా పరిచయం వున్న ముఖం. అతను లోపలికి వెళ్లిపోయాక గుర్తొచ్చింది. యిడ్లిబండబ్బాయి. అతను మరో ఖాళీ అయిన టేబుల్ క్లీన్ చేయడానికి వచ్చాడు.

'అతను నరసింహ కదా' అడిగాను.

'హూఁ. నరసింహే. యిక్కడ పనికి చేరాడా' సందీప్ మామూలుగా అన్నాడు.

'ఇక్కడ చేరారా' పలకరించా.

'ఆ'

'మీ యిడ్లిబండి'

'గిరాకీ లేదమ్మా'

'యిక్కడ బాగుండేది కదా. అసలు యిక్కడ నుంచి మీరంతా ఎందుకు వెళ్లిపోయారు'


'వెళ్లిపోలేదు. మమ్మల్ని...'

'ఎక్స్‌క్యూజ్‌మీ' పక్క టేబిల్ నుంచి పిలుపు.

'యిప్పుడే వస్తా' అని నర్సింహ వెళ్ళాడు.

బేరర్- క్లీనర్- సర్వర్- వొకనాటి వోనర్ నర్సింహా. ఇడ్లిబండిపై వేడివేడి యిడ్లీలు, దోశలు, సెనగపప్పు- అల్లంపచ్చడి, కారంపొడి, టీ, కాఫీ. పక్కనే ఛాట్‌బండి. పానీపూరి, బేల్‌పూరి, రగడాఛాట్, పావ్‌భాజి, జిలేబి.

కాలనీవాళ్లు, కాలేజ్ స్టూడెంట్స్, దారేపోయెవాళ్లలే ఎప్పుడే యీ రెండు బళ్లు బిజీగా వుండేవి. చుట్టుపక్కల కాలేజ్ స్టూడెంట్స్ అడ్డా. టూవీలర్స్‌ని ఆనుకొని బండరాళ్లపై కూర్చుని కారుల్లో కార్లపైన కూర్చుని తింటూ గుంపులుగుంపులుగా అమ్మాయిలు అబ్బాయిలు కబుర్లు చెప్పుకునే వాళ్లం.



పద్మ

అప్పుడప్పుడు యిడ్లీ, దోశ పార్సిల్ చేయించుకొని అమ్మకి తీసుకువెళ్లేదాన్ని. అమ్మకి అల్లం పచ్చడి, కారప్పొడి భలే నచ్చేది. ఈ కాలేజ్‌కి వచ్చిన కొత్తలో స్టూడెంట్స్ దగ్గర యిప్పుడున్నన్ని కాకపోయినా పేజర్స్, సెల్‌ఫోన్స్ ఎక్కువగానే వుండేవి. ఎక్కువగా అబ్బాయిల దగ్గరే వుండేవి. వోరోజు కాలేజ్‌కి డ్రాప్ చేయడానికి వచ్చిన అమ్మ 'సెల్‌ఫోన్స్, పేజర్స్, కొత్తకొత్త కార్లు. అయినా బళ్లమీదవి బానే తింటున్నారే' అంది.

'వీళ్లలో చాలామంది సాయంత్రం ఫైవ్‌స్టార్, త్రీస్టార్ హోటల్స్‌కి, క్లబ్స్‌కి, రిసార్ట్స్‌కి, లేట్‌నైట్ పార్టీస్‌కి, డిస్కోస్‌కి వెళతారు'

'వూహూ' అంది అమ్మ గోడమీద గోవింద సినిమా పాట 'మైబేల్‌పురి' వాల్‌పోస్టర్‌పై చూపు నిలిపి.

దశరా సెలవలు అయిపోయి కాలేజీకి వచ్చేసరికి యిడ్లీ ఛాట్ బళ్లు లేవు.

డ్రింక్‌యిన్- రెస్టారెంట్.

పీజా, బర్గర్, పేస్ట్రీస్ ఐస్‌క్రీమ్‌కోక్ థమ్సప్ మెరిన్‌డా. ఇద్దరికి మాత్రమే సరిపోయె టేబుల్స్.

వీడియోగేమ్స్. యింటర్‌నెట్. గ్రీటింగ్ కార్డ్స్. పువ్వులు. రంగురంగుల నిలువెత్తు డబ్బాలో టెలిఫోన్.

అప్పట్నుంచి డ్రింక్‌యిన్ మా అడ్డ.

డ్రింక్‌యిన్ రావటంతో యిడ్లీ ఛాట్‌బళ్లు, డబ్బా టెలిఫోన్ బూత్ మాయమైపోయాయని చెప్పాను.

'వాళ్లంతా ఏమైపోయారు' అంది అమ్మ.

'ఏమైపోరు. వేరే చోట వ్యాపారం బాగుంటుందని వెళ్తుంటారు' అన్నాడు నాన్న.

చప్పున టాపిక్ మార్చేసాను. వాదన ఎటు తిరిగినా చివరికి అమ్మ నొచ్చుకునేట్లు ఏదో వో మాట అనేస్తాడు నాన్న.

నరసింహ కనిపించిన రాత్రి భోజనాలప్పుడు 'నరసింహ కనిపించాడు' అమ్మకి చెప్పాను.

'ఏ నరసింహ' అమ్మ అడిగింది.

'యిడ్లీబండి. డ్రింక్‌యిన్‌లో సర్వర్. క్లీనర్ బేరర్.... ఏదైనా కానీ ప్రస్తుతం అక్కడ పనికి చేరాడు. డ్రింక్‌యిన్ మొదలవ్వటానికి రెండ్రోజుల ముందు ట్రాఫిక్ పోలీసులు తరిమేసారంట. మూడేళ్లుగా మేం వుంటున్నాం. వాళ్లకి అంతోయింతో యిచ్చుకుంటున్నాం. మేం ఎలా ట్రాఫిక్‌కి అడ్డం అయ్యామో తెలియదు. తరిమేసారు అని బాధపడ్డాడు. ఇదంతా డ్రింక్‌యిన్ వాళ్లే డబ్బులిచ్చి చేయించారని నరసింహ నమ్మకం. అక్కడ నుంచి మరోచోటకి వెళితే అప్పటికే అక్కడున్న బళ్ల వాళ్లతో గొడవంట. వాళ్ల వ్యాపారం పోతుందని. సంపాదించిన డబ్బుల్లో పెద్దగా దాచుకున్నవి లేవంట. టి.వి. స్కూటర్, ఫ్రిజ్ యిన్‌స్టాల్‌మెంట్స్‌లో కొనుక్కున్నాడంట. ఆ బాకీలు తీర్చటం, యిల్లు గడవటం. రోజురోజుకి తగ్గిపోయిన గిరాకీ చివరికి డ్రింక్‌యిన్‌లో చేరాడంట' నరసింహ చెప్పిందంతా చెప్పాను.

'ట్రాఫిక్ పోలీసులా?! వ్యాపారం బాగ సాగుతుందని గమనించే డ్రింక్‌యిన్ వాళ్లు రెస్టారెంట్ మొదలుపెట్టారు. డబ్బాఫోన్ కుర్రాడిని పంపించేసారు. వొకరిద్దరు కస్టమర్స్‌ని కోల్పోవటం కూడా వాళ్లకి యిష్టంవుండదు. ఆ బళ్లు రెస్టారెంట్ పక్కన వుండటం కూడ చీప్‌లుక్ అనుకొని వుంటారు. 'యీటింగ్ వరల్డ్' రాగానే రోజూ కూరలు కొనుక్కొచ్చే అవ్వ తట్ట లేచిపోయింది కదా' అంది అమ్మ.

'యీటింగ్ వరల్డ్‌లో కూరలు ఫ్రెష్‌గా వుంటాయి. అన్ని సామాను వొక్కచోటే

కొనుక్కోవచ్చు కదా' అన్నాడు నాన్న.

'అవ్వ దగ్గరా ఆకుకూరలు పచ్చిమిర్చి వంకాయలు ఏ కాయగూరైనా నిగనిగలాడుతూనే వుండేవి'

'నీది వుత్తి ఆవేశం అరుంధతి. కరడుకట్టిన ధీయరీలు. నీ కమ్యూనిస్ట్- ఫెమినిస్ట్ బుద్ధులు పోనిచ్చుకున్నావ్ కాదు. నీకేం తెలుసు యిండియాలో ముఖ్యంగా మన దగ్గర పర్చేజింగ్ పవర్ ఎంతలా పెరిగిందో. ఫ్రిజ్‌లకి, టి.వీ.లకి, కార్లకి, యిల్లు కొనుక్కోడానికి లోన్స్ యిస్తున్నారు. కొన్ని యింట్రస్ట్ ఫ్రీ కూడా. పేదాగొప్ప తేడా పెద్దగా లేదు. నువ్వు వుత్తినే ఆవేశపడుతున్నావ్' అన్నాడు నాన్న.

'పేదాగొప్పా లేదు. పర్చేజింగ్ పవర్. కన్స్యూమర్ పవర్. లెస్ కన్స్యూమర్స్. మోర్ కన్స్యూమర్స్. అసలుసిసలైన బ్యూరోక్రాట్‌వి' అంది అమ్మ.

రెండ్రోజులకోసారి యింట్లో యివే గొడవలు కొన్నాళ్లుగా. నాన్నకి సొంత ఎజెండా వుండటం మేం చూడలేదు. ఏ పాత్రలోనైనా యిమిడిపోయి ఆ ఆకారంలా కనిపించే నీళ్లలా నాన్న పని చేసేస్తుంటే 'అసలీ పనులు ఎందుకు చేస్తున్నావ్? వీటివల్ల జరుగుతుందేమిటో తెలియదా' అమ్మ అడిగిందోరోజు.

'షటప్. నన్నెవరూ ప్రశ్నించరు? నాతో ఎవ్వరూ యిలా మాట్లాడరు. నువ్వు తప్పా. నువ్వూ నీ బోడి ఫెమినిజం. ఎవరిక్కావాలి. నాలుగు నోట్లు చూపిస్తే నీతోవున్న ఆ నలుగురాడాళ్లు యిటొచ్చేస్తారు. డబ్బు సంపాదించటం చేతకాక సుఖంగా బతికేవాళ్లని ఆడిపోసుకోవటం. నీ కొడుకే నీ ఆలోచనలు పొరపాటంటున్నాడు. గుర్తుంచుకో యింకెప్పుడూ హాఫ్ నాలెడ్జ్‌తో ప్రశ్నించకు' నాన్న నోరు పారేసుకుంటున్నాడు.

'నే నమ్మిన విలువలకి నే కట్టుబడి వున్నాను. నువ్వు వున్నావా' అమ్మ అడిగింది.

'ఏంటి నీ విలువలు? ఆడాళ్లకి రాజ్యమా? చదువా? డబ్బా? పిల్లలా? మొగుడా? అందాల పోటీలా? నా విలువలనే ప్రశ్నిస్తావా? పొగరెక్కి...' తింటున్న అన్నంపళ్లెం నేలకేసి కొట్టాడు నాన్న.

వాళ్లిద్దరి బెడ్‌రూమ్స్ వేరైపోయాయి.

'ఏంటమ్మా యిదంతా? ఇంతగా మీ యిద్దరికి ఏ విషయంలోను పడదుకదా ఇద్దరూ యిష్టపడి ఎలా పెళ్లి చేసుకున్నారు' ఆరోజు అమ్మని అడిగాను.

'ఇష్టపడే చేసుకున్నాం. ఇంట్లో వాళ్లని వొప్పించి, కాదన్నవాళ్లని పట్టించుకోకుండా నే చేసుకున్నాం. అప్పట్లో విజయ్ ఇలావుండేవాడు కాదు. రానురాను అతనిలో రకరకాల మార్పులు వచ్చాయి. పవర్ వైపు, అక్రమార్జనవైపు తను పరుగు మొదలుపెట్టినప్పట్నుంచి అతనిని రక్షించుకోవాలని నే చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఇప్పుడు ఏ మానవీయ స్పర్శా అతనికి అక్కర్లేదు. ముందే అతను యిలా వుండివుంటే తను నా ఛాయిస్ అయివుండేవాడు కాదు" అంది అమ్మ.

'ఇలా ఎందుకు జరుగుతుందంటావ్'

'గ్లోబలైజేషన్ బ్యాంక్స్ దగ్గరే ఆగిపోదమ్మా. బెడ్‌రూమ్‌లోకీ వచ్చేస్తుంది' అంది అమ్మ.

ఆ రోజునుంచి అమ్మానాన్న మాట్లాడుకోవటమే అరుదైపోయింది. యీ యిద్దరూ యీ యింటి నుంచి విడిపోకుండా వుండటానికి కారణం నేనూ తమ్ముడేనా?!

యీ యింట్లో యీ అశాంతికి కారణం. అమ్మ అర్థంలేని విలువలేనని తమ్ముడి నమ్మకం.

'అమ్మ పిచ్చిది కాకపోతే తను సంపాదించే ఐదువేలుతో మనం కంఫర్టబుల్‌గా బతకగలమనుకుంటుందా? నాన్న బాగా సంపాదిస్తుండటం వల్లేకదా నాకో ఎస్‌డి, నీకో కంప్యూటర్, మంచి పాకెట్‌మనీ, బట్టలు, తిండి. అవునాకాదా. వెర్రిదానిలా నా డబ్బులతోనే నే బతుకుతానంటూ ఎందుకంత సింపుల్‌గా వుండాలి? హాపీగా ఖర్చు పెట్టుకోవచ్చుకదా. బయట నాన్న అంత కష్టపడి వస్తాడు కద, ఇంటికొచ్చేసరికి యిద్దరికిద్దరే' విసుక్కుని ఆరోజు నుంచి తమ్ముడూ మా యిద్దరితో సరిగ్గా మాట్లాడటం మానేసాడు.

ఇన్ని గొడవల మధ్యకి నరసింహ సమస్యని అనవసరంగా తీసుకొచ్చానేమో. అమ్మ

> **'గ్లోబలైజేషన్ బ్యాంక్స్ దగ్గరే ఆగిపోదమ్మా. బెడ్‌రూమ్‌లోకీ వచ్చేస్తుంది' అంది అమ్మ.**
> **ఆ రోజునుంచి అమ్మానాన్న మాట్లాడుకోవటమే అరుదైపోయింది. యీ యిద్దరూ యీ యింటి నుంచి విడిపోకుండా వుండటానికి కారణం నేనూ తమ్ముడేనా?!**

వొక్కతే వున్నప్పుడు చెప్పాల్సింది.

టాపిక్ మార్చాలి. వెంటనే ఏ టాపిక్. తమ్ముడి చదువు. నా చదువు. టి.వి. సీరియల్స్. @ కామ్... అరే... బ్లాంక్... ఆఁ... సందీప్.

'నే కాలేజ్‌కి వెళ్లాక సందీప్ ఏమైనా ఫోన్ చేసాడా? యీమధ్య కలిసి పదిరోజులైపోయింది. ఫోన్ చేసినా దొరకటంలేదు' అన్నాను.

'లేదు. బిజీగా వున్నాడేమో' అన్నాడు.

'ఇంట్లో ఎవ్వరూ లేరా' అమ్మ అడిగింది.

'ఆంటీ వున్నారు. మెసేజ్ యిచ్చాను'

ఫోన్ మోగింది. నాన్న తీసారు.

'హాయ్ఁ హౌఆర్‌యూ హాఁ గుడ్ వెరీగుడ్. కంగ్రాట్స్' అని ఆగి నాన్న కార్డ్‌లెస్ అందించారు.

'హలో'

'హాయ్ఁ. జాబ్ వచ్చింది. స్టేట్స్ వెళుతున్నా. అరేంజ్‌మెంట్స్‌లో బిజీ' సందీప్ చెపుతున్నాడు.

'రేపు డ్రింక్‌యిన్‌కి రా' అన్నాను.

'రేపా? రేపు కాదు. ఎల్లుండి'

'రేపేంటిపని'

'క్లాస్‌వుంది'

'ఏ క్లాస్'

'పర్సనాల్టి డవలప్‌మెంట్. రేపు ఆఖరి క్లాసు' అన్నాడు.

'ఎల్లుండి సాయంత్రం. బై'

'గుడ్. వెరిగుడ్. సందీప్ అమెరికా వెళుతున్నాడంట. వచ్చే ఏడాది నా కొడుకూ వెళతాడు...' నాన్న మాట్లాడుతూనే వున్నాడు. నాకేం వినిపించటంలేదు.

అమెరికా వెళతాడా? అసలీ ప్రస్తావనే మా మధ్య ఎప్పుడూ రాలేదు.

అమ్మ గదిలోకి నా వెనకే వచ్చింది.

'సందీప్ వెళ్లాలనుకుంటున్నాడని నీకు తెలుసా'

'తెలియదు'

'ఏంటలా అయిపోయావ్'

'అమెరికా... తను వెళితే అతన్ని చాలా మిస్ అవుతా'

'తిరిగి వస్తాడుగా'

'వుద్యోగానికి వెళుతున్నాడు'

'వూఁ. ఏడాదికి తిరిగి రాడా'

'సంవత్సరం తక్కువ కాలమా? వచ్చినా తిరిగి వెళతాడు. తనని కలవకుండా మాట్లాడకుండా వుండటం నాకు కష్టంగానే వుంటుంది'

'నీకు అమెరికా వెళ్లాలని వుందా లేదా?' అమ్మ అడిగింది.

'కొన్నాళ్లు వుండి వుద్యోగం చేయటం చదువుకోవటం పట్ల నాకేం అభ్యంతరం లేదు. సెటిల్ అవ్వాలని లేదు. అయితే యిప్పుడు సమస్య నా చదువు యింకా పూర్తికావడానికి ఏడాది టైమ్ వుంది. తనతో వెంట



నే వెళ్లలేను కదా' అన్నాను.

'వెంటనే వెళ్లలేకపోవచ్చు. బెంగగానే వుంటుంది. కానీ కమ్యూనికేషన్ కష్టం కాదుకదా. ఇమెయిల్, చాట్ యిన్ని వున్నాయి కదా. ఎల్లుండి కలిసినప్పుడు అన్ని విషయాలు స్పష్టంగా మాట్లాడు' అంది అమ్మ.

'వినగానే బాగా దిగులేసింది. చదువు పూర్తి చేసాకే వెళతా. కమ్యునికేషన్ పెద్ద సమస్యకాదు. క్షణాలపై అన్నీ మాట్లాడైవచ్చు. ఇట్స్ వెరి ఫన్నీ. ఓ పది నిమిషాల ముందు వరకు సందీప్ ఫోన్ చెయ్యలేదని తప్పా మరే ఆలోచన లేదు. ఇప్పుడేమో చదువు పూర్తి చేయటం అమెరికా వెళ్లటం ఎలా - యివే ఆలోచనలు. సందీప్ నేను పెళ్లి చేసుకోవాలని అనుకున్నాం. కాని ఎప్పుడు ఎక్కడా ఎలా అని అనుకోలేదు. ఎల్లుండి మాట్లాడాలి' అన్నాను.

ఇదిగో యిప్పుడిలా సందీప్‌తో

- 'ఏమిటి మాట్లాడాలన్నావ్' అడిగాడు సందీప్.

'అమెరికా వెళుతున్నావ్. మనం ఎలా ప్లాన్ చేసుకుందాం' అడిగాను.

సందీప్ కొంచెం సమయం తీసుకొని 'ఎమోషనల్‌గా కష్టంగానే వుంటుంది. కానీ ప్రాక్టికల్‌గా తప్పటంలేదు. నీ చదువు నా చదువు వేరు. మనిద్దరికి వొక్కచోట వుద్యోగం దొరకటం కష్టం. ఛాన్స్‌లేదు. నా ప్రొఫెషన్‌లోనే వున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే యిద్దరం వొకేచోట వుద్యోగం చేయవచ్చు. వొకేసారి ఆఫీసుకి కలిసి వెళ్ళొచ్చు. యింటికి కలిసి తిరిగి రావొచ్చు. ఇంటిపని కలిసి చేసుకోవచ్చు. ప్రొఫెషనల్‌గా బోల్డంత చర్చించుకోవచ్చు. నీపని పూర్తయి నువ్వు యింటికి త్వరగా వచ్చేస్తావనుకో. నాపని కాకపోవచ్చు. అప్పుడు యింట్లో వొంటరిగా నాకోసం నువ్వు ఎదురు చూస్తుంటావ్. నువ్వు ఆలస్యమై నే త్వరగా రావొచ్చు. అప్పుడు నువ్వు ఎదురుచూడాలి. లాంగ్‌రన్‌లో గొడవలు లేకుండా వుండాలంటే ప్రాక్టికల్‌గా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ఫ్యామిలీ లైఫ్, టెన్షన్స్ వర్క్ మీద పడకూడదు' సందీప్ చెపుతున్నాడు.

సందీప్ కొత్తగా తోచాడు. కొత్త మాటలు. కొత్త ఆలోచనలు. పదిరోజులైయిందా కలిసి. యింతలోనే ఎంత కొత్తో.

'ఫ్యామిలి లైఫ్ చాలా ముఖ్యమంటా వర్క్‌లో సక్సెస్ అవ్వటానికి'

'ముఖ్యమంటా... ఎవరు చెప్పారు' అడిగాను.

'పర్సనాల్టి డవలప్‌మెంట్ క్లాసెస్‌కి వెళ్లానుగా'

'ఎన్ని క్లాసులు'

'రోజుకి రెండుగంటలు, ఏడు రోజులు'

'మొత్తం పధ్నాలుగు గంటలు'

'ఆఁ. మనం మంచి స్నేహితుల్లా వుండిపోదాం. పెళ్లి చేసుకొని లాంగ్‌రన్‌లో పోట్లాడుకోకుండా... విడిపోకుండా నువ్వు కూడా చక్కగా సోషియాలజి స్టూడెంట్‌ని చూసి పెళ్లి చేసుకుంటే యిద్దరూ కలిసి వొకే పనిని చేయచ్చు. ఎన్.జి.ఓ పెట్టొచ్చు. కన్సల్టెంట్స్‌గా పనిచేయచ్చు. పనిని షేర్ చేసుకోవచ్చు'

'గుడ్. పర్సనాల్టి డవలప్‌మెంట్ క్లాసెస్ నీకు బాగా నచ్చాయా'

'చాలా. మనం కొన్ని విషయాలని అర్థం లేకుండా ఆలోచిస్తాం. నే నిన్ను పెళ్లి చేసుకోనని చెపితే నువ్వు బరస్ట్ అవుతావని, నీ విషయంలో నా నిర్ణయం తప్పని, అన్యాయమని, ఇన్‌హ్యూమన్ అని అమ్మ బోల్డంత పోట్లాడింది. కోప్పడింది. నచ్చచెప్పాలని ప్రయత్నించింది. నే చెబుతూనేవున్నా నువ్వు అర్థం చేసుకుంటావని, యీ నిర్ణయం మన యిద్దరి జీవితాలకి మంచిదేనని' సందీప్ మాట్లాడుతూనే వున్నాడు.

పధ్నాలుగు గంటల పర్సనాల్టి డవలప్‌మెంట్ క్లాసెస్, మా ఐదేళ్ల స్నేహం, ప్రేమని యింత ప్రాక్టికల్‌గా ఆలోచింపచేసి నిర్ణయాలని తీసుకొనేంత శక్తివంతమైనవా?

లేక బుర్రలో తిరుగుతూ అటుఇటూ కొట్టుమిట్టాడుతున్నవాటిని బయటకి లాగి పైకి మాట్లాడటానికి కావల్సిన సపోర్ట్‌ని యిచ్చాయా? నిజంగా సందీప్ చెపుతున్నవి కారణాలేనా?అంతకంటే బలమైనది, భయపెట్టేది

చెప్పలేక యివి చెపుతున్నాడా? బతకటం అవసరమా అనవసరమా అటో యిటో తేల్చిచెప్పే కౌన్సిలింగో, డెవలప్‌మెంటో ఏదోఒక క్లాసో, వర్క్‌షాపో వుంటాయి. ఎందులోకి వెళ్లాలన్నది మన ఛాయిస్ కదా.

సో... సందీప్ ఛాయిస్.

పంచుకున్న కాలాన్నో, జల్లుకొన్న రంగుల్నో, విరజిమ్ముకొన్న పరిమళాలనో, చెవిలో ముద్దునో, తడబడుతూ అల్లుకున్న శరీరాల మోహస్పర్శనో గుర్తుచేసి నిర్ణయం మార్చుకో అని నచ్చచెప్పటం వాదించటం అనవసరం. ఆ రాత్రి కంప్యూటర్ ముందు కూర్చుని మెయిల్ చూస్తున్నా.

'మీ అమ్మలా వుత్తినే ఆవేశపడటం తప్పా బతికే తెలివి లేదు. నేనప్పుడే చెప్పా. సోషల్ సైన్సులు వద్దూ. ఎంసెట్ రాయమన్నా. వినలేదు. బియస్సీ కంప్యూటర్స్... వినలేదు. సందీప్‌కి చెప్పొచ్చుగా- సంవత్సరంలో డిప్లమా కోర్సు చేసి వచ్చేస్తా నీ లైన్‌లోకే అని. ఐ.టి.దే భవిష్యత్తంతా ఇప్పటికేనా నా మాట విని ఏదాది కోర్సులో చేరు. కంప్యూటర్ లైన్‌లో లేకపోతే పెళ్లిళ్లు కష్టం' నాన్న మాటలు వింటుంటే నవ్వొచ్చింది.

'ఏదైనా యాడ్ ఏజన్సీ వాళ్లకి ఫోన్‌చేసి ఐ.టి.లో చేరితే మొగుడు గ్యారెంటీ అని చెప్పరాదు. కంప్యూటర్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రకటనల్లో వాడుకుంటారు' అన్నాను.

'నవ్వులాటగుంది. క్లాసెస్‌కి వెళ్లు'

'నాన్నా! ఏ రంగానికున్న ప్రాముఖ్యం ఆ రంగానికుంటుంది. నా పనులన్ని కంప్యూటర్‌తో హాయిగా చేసుకుంటున్నాగా. నాకు అవసరమైన స్కిల్స్‌ని నేర్చుకుంటూనే వున్నాగా. కానీ ఆ ఫీల్డు నా ప్రొఫెషన్ కాదు. పెళ్లి కోసమని కంప్యూటరూ నేర్చుకోను. వంటా నేర్చుకోను. నాకు ఆసక్తిగా నా యిష్టంగానో అవసరంగానో అనిపిస్తే ఏమైనా నేర్చుకుంటా. అంతేకాని పెళ్లి కాదనో, మొగుడు వదిలేస్తాడనో నేర్చుకోను'

'మీ అమ్మలా తయారయ్యావ్. వూఁ... సర్లే... నీకేమైనా మెయిల్ వుందా' అన్నారు నాన్న.

'లేవు. అమ్మకి వుంది" అన్నాను.

నాన్న గదిలోంచి వెళ్లిపోయాడు.

**     **     **

సందీప్... సంవత్సరం తర్వాత పదిరోజుల సెలవుపై వచ్చాడు. పెళ్లికి పిలిచాడు.

అరటిచెట్లు, మల్లెపూలు, కొబ్బరాకులు, మామిడాకుల మంటపంలో సందీప్ ఆ అమ్మాయి మెడలో తాళికట్టాడు.

'ఇంటికి రాలేకపోతున్నా... టైమ్‌లేదు. తను వెంటనే అక్కడ జాబ్‌లో జాయిన్ అవ్వాలి. ఒకేచోట ఇద్దరి వుద్యోగం. నీకు జెఎన్‌యులో సీట్ వచ్చిందంటకదా. నెక్స్ట్ టైమ్ వయా ఢిల్లీ వస్తే నిన్ను చూడొచ్చన్న మాట' అన్నాడు.

'వూహూ'

'అక్కడికి వచ్చి ఏదైనా యూనివర్సిటీలో చదువుకోవచ్చుకదా' అన్నాడు.

'వూ... వెళతానింక'

"ఒక్క నిమిషం" అని సందీప్ పార్క్‌చేసిన కార్లవైపు వెళ్ళాడు. తిరిగొచ్చి 'ఇది నీకోసం తీసుకొచ్చా. నెంబర్ బటన్స్ అక్కర్లేదు. పర్సన్ పేరు, నెంబర్ చదువుకుంటూ వెళ్లు. రికార్డ్ అయిపోతాయి. ఫోన్ చేయాలనుకున్నప్పుడు ఆ వ్యక్తిపేరు చెప్పు. ఆటోమేటిక్‌గా డైల్ అవుతుంది. కాన్ఫిడెన్షియల్‌గా వుంటుంది. నెంబర్స్ గుర్తుపెట్టుకోక్కర్లేదు. టెలిఫోన్ నెంబర్స్ పుస్తకాన్ని మోసుకు తిరగక్కర్లేదు. జె.టి.ఎమ్, టాటా ఏదోవొక కనెక్షన్ తీసుకో' చిన్నిగా ముద్దుగా వున్న నల్లని యిన్‌స్ట్రిమెంట్‌ని చూపిస్తు అన్నాడు.

'సెల్ వాడేంత పనేం లేదే'

'ఢిల్లీ వెళుతున్నావ్. చాలా యూజ్‌ఫుల్' అన్నాడు.

'వాడే వాళ్లకి యిస్తే సంతోషిస్తారు. వాడను కదా. మూలపెట్టాలి. వాడే అవసరం యిప్పట్లో రాదు' అన్నాను.

'నీ కోసమె తెచ్చా. ఎలా? ఏమివ్వను. పెర్‌ఫ్యూమ్స్ కాని యిక్కడ లేవు. ఇంట్లో వున్నాయి. డ్రైవర్‌తో మీ యింటికి పంపించనా'

'వద్దొద్దు. పెళ్లికి వచ్చాను. మల్లెపూలు యిచ్చారుగా. చాలు వెళతా.'



**_'సందీప్ నిర్ణయం విన్నప్పట్నుంచి నే చాలా భయపడ్డా నీ గురించి. ఇమోషనల్‌గా నిన్ను నువ్వు ఎలా నిలబెట్టుకుంటావా అని దిగులుపడ్డా. నా కిప్పటికి ఆశ్చర్యంగానే వుంటుంది. నీ లోపలి సంఘర్షణని ఎలా ఎదుర్కున్నావాని' అంది అమ్మ._**

'సినిమాల్లో చూపించినట్టే పెళ్లిళ్లు జరుగుతాయా అని అమెరికన్ ఫ్రెండ్స్ అడిగారు. వాళ్లకి కేసెట్ చూపిస్తానని చెప్పాను. అందుకే కష్టపడి అరటిచెట్లని కొబ్బరాకుల్ని, మల్లెపూలని, మామిడాకుల్ని తెప్పించాం. పద్ధతిగా అన్ని చేసాం. ఫ్రెండ్స్‌ని పిలిచి చూపించి పార్టీ యిస్తాం. వాళ్లకి యివి బాగా నచ్చుతాయి' సందీప్ చెపుతుంటే చాలారోజులుగా నాలోనే వుండిపోయిన సందేహం గురించి అడగాలనుకున్నా.

'ఇవన్ని నీకు నచ్చువా' అడిగాను.

'నచ్చటం నచ్చకపోవటానికి ఏముంటుంది. మన ట్రెడిషన్ కదా. మన విషయాలపట్ల వాళ్లకు చాలా ఆసక్తి'

'వూహూఁ. మనం వొక్కచోట వుద్యోగాలు చేయలేమని యిలా ఏవేవో చెప్పావు ఆ రోజు మన పెళ్లికి అడ్డంకులుగా. నిజంగా అవి సమస్యలా? కలిసి బతకడాన్ని, విడిపోడాన్ని ఆ చిన్న విషయాలు నిర్ణయిస్తాయా? నీ పర్సనాల్టి డవలప్‌మెంట్ క్లాసెస్‌లో మనం కలిసి బతకటంలో సంఘర్షణ వుంటుందని నువ్వు గుర్తుపట్టావ్. కాని ఎందుకు అనేది నువ్వు చెప్పలేక కలిసి ఆఫీసుకి వెళ్ళడం, కలిసి వండుకోవటం, తినటం అంటూ కారణాలు చెప్పేవు. ఇప్పటికైనా అసలు కారణాన్ని చెప్పగలవా?' అడిగాను.

సందీప్ కొన్ని క్షణాలు ఏం మాట్లాడలేదు.

'మునీరా...' అని నా వైపే రెండు క్షణాలు చూసి... తలాడిస్తూ 'నిజమే. అప్పుడు నీకు చెప్పగలను అనుకున్న వొకటిరెండు కారణాలు చెప్పేను. నిజానికి ఆ క్లాసెస్ చెప్పే ధైర్యాన్ని యిచ్చాయి. కానీ చాలాకాలంగా మన యిద్దరి జీవితం పట్ల నాకెన్నో సందేహాలు, అనుమానాలు. మొదట్లో మనిద్దరి యిష్టాలు అభిప్రాయాలు వొకేలానో, దగ్గరగానో వుంటూ వచ్చాయి. నువ్వు యీ దేశంలో వస్తున్న ప్రతిమార్పుని వొప్పుకోదానికో, ఆచరించడానికో సిద్ధంగా లేవు. నరసింహా విషయమే తీసుకో. నిన్ను బాధపెట్టింది. నాకే బాధా లేదు. మార్పు సహజం. అభివృద్ధిని ఎందుకొద్దనాలి. యింకొకరి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసే అభివృద్ధిపట్ల నీకు అభ్యంతరం వుంది. మనిద్దరి జీవితం మీ అమ్మానాన్నగారిలా రోజూ గొడవలతోనే నిండిపోతుందని భయం వేసింది. మా నాన్నగారు చేసే పనులు పట్ల మా అమ్మకి ఏ అభ్యంతరం వుండదు. ఎక్కువ సంపాదిస్తే నాకు, అక్కకి యింకాస్త ఎక్కువ డబ్బులు యివ్వొచ్చు అనుకుంటుంది తప్పా యీ దేశంలోనే బయటో జరిగేవి ఏది ఆమెకి పట్టదు. మా యింట్లో మీ యింట్లోలాంటి గొడవలు వుండవ్. నీకూ నాకు చాలా విషయాలలో కుదర్దనిపించింది' అన్నాడు సందీప్.

'వూహూ'

యింటికి వచ్చేసాను.

అమ్మకి చెపితే 'ఇన్‌ప్రిన్సిపుల్ కలవదు అనుకొనివుంటాడు'- అంది.

'కలవటం కష్టం. అమెరికన్ స్నేహితులకోసమో, రష్యన్ బంధువుల కోసమో నే పూలజడని వేసుకోలేను కదా. నాకు వేసుకోవాలనిపిస్తే తప్పా. లేదా నా మొగుడు ఆస్వాదిస్తానంటే తప్పా. కేసెట్ల కోసం నావల్ల కాదు కదా. నేనింకా ఏం సర్దుకోలేదు. రా.' అంటూ గదిలోకి వెళ్లి సూట్‌కేస్‌లు తెరిచా.

బట్టలు పుస్తకాలు కేసెట్స్ సర్దుతున్నాం.

'సందీప్ నిర్ణయం విన్నప్పట్నుంచి నే చాలా భయపడ్డా నీ గురించి. ఇమోషనల్‌గా నిన్ను నువ్వు ఎలా నిలబెట్టుకుంటావా అని దిగులుపడ్డా. నా కిప్పటికి ఆశ్చర్యంగానే వుంటుంది. నీ లోపలి సంఘర్షణని ఎలా ఎదుర్కున్నావాని' అంది అమ్మ.

'నాన్న పూర్తిగా పవర్‌కి, డబ్బుకి అలవాటుపడటానికి ఇరవైఏళ్లు పట్టింది. సందీప్ పూర్తిగా మారిపోవటానికి పధ్నాలుగు గంటలు పట్టింది. ఇరవైఏళ్లుగా కొంచెంకొంచెంగా మారిపోతూ వున్న నాన్నని చూసి నువ్వెంత బాధపడ్డావో. బాధపడకుండా వుండలేవు. విడిపోనూలేవు. ఇరవై ఏళ్లు తక్కువ సమయం కాదు. ఎలాగోలా కలిసి వుండటానికి అలవాటుపడిపోతాం. బట్ పదిహేను గంటలు అరగంట పదిహేను నిమిషాలు ఎక్కువ సమయం మీక్కాదు. మాకు ఎక్కువే. త్వరత్వరగా తీసుకునే నిర్ణయాలు మా తరాన్ని నిలబెడతాయో ముంచేస్తాయో ఆనందాన్ని సంతృప్తిని యిస్తాయో విషాదమైన శూన్యాన్ని నింపుతాయో యిప్పుడే నేనేం చెప్పలేను. కానీ నాకు వో విషయం ఆశ్చర్యంగానే వుంటుంది. సందీప్‌ని కలవాలని రెండ్రోజులు పడిన ఆత్రుత ఆరాధన బాధ ఆదుర్దా సందీప్ నిర్ణయం విన్నప్పుడు ఏమైపోయాయో తెలియలేదు. పధ్నాలుగు గంటల్లో మారిపోయిన కుర్రాడు యిరవైఏళ్లలో ఏమవుతాడంటావ్? వాళ్లతో వుండివుండి మన వ్యక్తిత్వాలు మారిపోవచ్చు. నీలా బాధపడో పడకుండానో కన్వీనియంట్‌గా అందులో యిమిడిపోయి సంతోషంగానో బతికైవచ్చు. ఆ బాధని భరించలేక చంపేయవచ్చు. ఏది ఏమైన మనం మనలా మిగలం. ఏమైనా కానీ నన్ను నేను కోల్పోదల్చుకోలేదు' అన్నాను.

'మీరు నిర్ణయాలు త్వరగానే తీసుకుంటారు. పట్టుకు వేళ్లాడరు. టైమ్‌వేస్ట్ కాదు... కానీ... ఏమో చూద్దాం'

'నీకో విషయం చెప్పటం మర్చిపోయా. సందీప్ పెళ్లికి వెళుతుంటే చూసా. యిప్పుడు డ్రింక్‌యిన్ లేదు. రెండ్రోజులు క్రితం నే వెళ్లినప్పుడూ వుంది. డ్రింక్‌యిన్ వెనక వో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ వచ్చింది. కదుతున్నప్పుడు డ్రింక్‌యిన్ ఆ కాంప్లెక్స్ వాళ్ళకి అడ్డు అని నే అనుకోలేదు. ఆ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెస్టారెంట్, బిలియర్డ్స్, ఇంటర్‌నెట్, పిల్లలపార్క్, కూరలు, కోళ్లు వొక్కటేంటి దొరకనివి లేవు. బట్టలు నగలు యిదీ అది అని కాదు అన్నీ వున్నాయి. రోడ్డు వైడెనింగ్ అంటూ నిమిషాలపై డ్రింక్‌యిన్ కూల్చేసరికి ఆ బిల్డింగ్ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎలివేషన్ కోసం డ్రింక్‌యిన్ కూల్చేసారు. ఇప్పుడు డ్రింక్‌యిన్ ఆనవాలు కూడా లేదు.

'అవునా. ఆ బిల్డింగ్ పేరు'

'లైట్ లైఫ్'

'లైట్....లైట్'

'ఆఁ లైట్ వెలుగు తేలిక. నీ యిష్టమొచ్చిన అర్థం చెప్పుకో' అన్నాను.

'పెద్ద బిల్డింగా'

'కోట్లు చేస్తుంది. మన జీవితాన్ని మనమే జీవిస్తున్నామా? లేదా ఎవరైనా శాసిస్తున్నట్టు జీవిస్తున్నామా' అడిగాను.

'మీ అమ్మలా ప్రశ్నలు వేయటం మొదలుపెట్టావే'- గదిలోకి వస్తూనే నాన్న విసుక్కుంటున్నాడు.

నే సమాధానం చెప్పేలోగా 'మునీరా సర్దాల్సినవి చాలావున్నాయి. లాంగ్‌జర్నీ. ఆపకు. కానీ త్వరగా అంటున్న అమ్మ వైపు చూసా.

నా కాలేజ్ గ్రూప్ ఫోటో పైన పేరుకున్న దుమ్ముని దులుపుతూ వెలుగు నిండిన చూపులతో నావైపే చూస్తోంది అమ్మ. ●